క్లుప్తంగా

8న రంగనాథ స్వామి కల్యాణం

సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో గల రంగనాథ స్వామి ఆలయంలో స్వామివారి దివ్య తిరుకల్యాణం ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు సనపల యతిరాజుదాసు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తలు పూజారి శ్రీనివాసరావు, పురుషోత్తమరావు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

డీవార్మింగ్ మాత్రల పంపిణీకి చర్యలు

సరుబుజ్జిలి: ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా డీ వార్మింగ్ మాత్రలు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక వైద్యాధికారి సంతోష్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 65 అంగన్‌వాడీ కేంద్రాల్లో గల 889 మంది చిన్నారులకు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 4,115 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

గోతులు పూడ్చారు



గోతులను పూడ్చుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

పాతపట్నం: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ గేట్ వద్ద జాతీయ రహదారి గోతులమయంగా ఉందని ఈ నెల 4వ తేదీన సాక్షిలో వార్త ప్రచురితమైంది. హైవే అధికారులు స్పందించి జాతీయ రహదారిలోని గోతులను గురువారం పూడ్చారు. వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

బోరు బాగుచేశారు



కొత్తూరులో బాగు చేస్తున్న బోరు మైకానిక్

కొత్తూరు: మండల కేంద్రంలో పాడైన తాగునీటి బోరును సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం బాగు చేశారు. ప్రజలకు తాగునీరు అందించడంతో సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాతపట్నం: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో పాతపట్నం విక్టరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ శకరంనారాయణ గురువారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో విశ్వం ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో అబాకస్ పోటీలు నిర్వహించారన్నారు. పాఠశాలకు చెందిన జూనియర్ స్టార్ లెవల్-1లో తులుగు యశశ్రీ మొదటి స్థానం సాధించింది రాష్ట్ర పోటీలకు ఎంపికైందన్నారు. ఎ.మోక్షిత్, టి.యాక్షిత్, పి.భరత్ జోనల్ స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్, పాఠశాల డైరెక్టర్లు అప్పారావు, తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

27 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని మెట్టుపేటలో మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన అదే గ్రామానికి చెందిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి మహిళ వద్ద 27 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్‌ఐ హెచ్చరించారు.

థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించొద్దు



బూర్జమానుగూడలో పోస్టర్‌ను అతికించిన గిరిజన నాయకులు

బూర్జ: థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించొద్దని శ్రీకాకుళం జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని గిరిజన గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతాల్లో థర్మల్ ప్లాంట్ నిర్మించి తమ బతుకులు బుగ్గిపాలు చేయవద్దన్నారు. బూర్జ మండలంలోని మదనాపురం నుంచి సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వరకు థర్మల్ విద్యుత్ నిర్మాణ ప్రతిపాదనను కేంద్రం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అనేక వ్యాధులకు, మానవాళి వినాశనానికి కారణభూతమయ్యే ప్లాంట్ నిర్మాణం వద్దని పోస్టర్‌లో ముద్రించారు.



నరసన్నపేట పట్టణం

పేరుంటే ఊరు లేదు..
ఊరుంటే పేరు లేదు

- రెవెన్యూ రికార్డుల్లో ఉన్న చిట్టివలస
- రెవెన్యూ రికార్డుల్లో పేరులేని నరసన్నపేట
- క్రయవిక్రయాలన్నీ రెవెన్యూ గ్రామాల పేర్లుతోనే..
- అయోమయానికి గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చిట్టివలస పేరుతో ఉన్న పొలాలు

నరసన్నపేట:

భౌతికంగా ఆ గ్రామం ఎవరికీ కనిపించదు. గ్రామం ఉన్నట్లే ప్రస్తుత తరానికి తెలీదు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఆ ఊరు భద్రంగా ఉంది.. అదే చిట్టివలస ప్రత్యేకం. ఊరు అయితే కనిపిస్తుంది. జిల్లాలోనే పేరున్న పట్టణం, ప్రముఖ వ్యాపార కేంద్రం నరసన్నపేట.. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఎక్కడా కనిపించదు. క్రయవిక్రయాలన్నీ రెవెన్యూ గ్రామాల పేర్లతోనే జరుగుతున్నాయి. నరసన్నపేట పేరే కనిపించదు. ప్రజలు కొంత అయోమయానికి గురవుతున్నారు.

రికార్డులకే పరిమితమైన చిట్టివలస

రెవెన్యూ రికార్డుల ప్రకారం మండలం చిట్టివలస గ్రామం పేరుతో 80 ఎకరాలు ఉన్నాయి. 20 సర్వే నంబర్లున్నాయి. ప్రస్తుతం కేవలం పొలాల హద్దులు మాత్రమే కనిపిస్తాయి. పారశెల్లి-రెల్లివలస మధ్య ఈ గ్రామం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. రెవెన్యూ అధికారులు నిర్వహించే రెవెన్యూ సదస్సులు, రీసర్వే సమావేశాలు, కౌలు రైతుల సమావేశాలు అన్నీ చిట్టివలస పేరుతో ఇప్పటికీ జరుగుతున్నాయి. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో రూపకల్పన చేసిన రెవెన్యూ గ్రామాలే నేటికీ కొనసాగుతున్నాయి. 1960 తరువాత నిర్వహించిన రీ సర్వేలో రెవెన్యూ గ్రామాల స్వరూపం కొంత మారినా ప్రయోజనం లేదు.

నరసన్నపేటది మరో కోణం..

స్వాతంత్రోద్యమం నుంచి గుర్తింపు ఉన్న పట్టణం నరసన్నపేట. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ పట్టణం వ్యాపార పరంగా ఉత్తరాంధ్రాకే ఒక ప్రత్యేకత ఉంది. ఎక్కడా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నరసన్నపేట పేరు కనిపించదు. టౌన్ పరిధిలో 923 సర్వే నంబర్లున్నాయి. 3,900 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉంది. ఇవన్నీ బొరిగివలస, బొడ్డవలస, సత్యవరం, గొట్టిపల్లి పేర్లతో ఉన్నాయి. ఈ నాలుగు పేర్లు రికార్డుల్లో రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. బొరిగివలస, గొట్టిపల్లి గ్రామాలు నరసన్నపేటకు ఆనుకొని ఉన్న పంచాయతీ కేంద్రాలు కాగా.. బొడ్డవలస నరసన్నపేటలో ఒక వీధి, సత్యవరం రెండు వార్డులు.. వీటి పేరున నరసన్నపేట పరిధిలోని విస్తీర్ణం అంతా ఉంది. క్రయవిక్రయాలన్నీ వీటి పేర్లతోనే జరుగుతున్నాయి. బొడ్డవలస, సత్యవరం రెవెన్యూ గ్రామాలు నరసన్నపేట పంచాయతీలో ఉండటంతో ఈ పేర్లపై వచ్చిన ఆదాయం నరసన్నపేటకు చేరుతుంది. బొరిగివలస, గొట్టిపల్లి పేర్లతో వేరేగా పంచాయతీలు ఉన్నాయి. ఈ రెవెన్యూ గ్రామాలు పేర్లపై జరుగుతున్న క్రయవిక్రయాలు పేరిట స్టాంప్ డ్యూటీ డబ్బులు ఆయా పంచాయతీలకు వెళ్తున్నాయి. నరసన్నపేట పంచాయతీ కొంత వరకు ఆదాయాన్ని కోల్పోతుంది. దీంతో కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని స్థానికులు అంటున్నారు. రీ సర్వే సందర్భంగా అయినా రెవెన్యూ గ్రామాల పేర్లు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

> **రెవెన్యూ గ్రామాల పునరుద్ధరణ జరగడం లేదు..**
>
> 
>
> నరసన్నపేట మండలంలో 45 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిని బ్రిటిష్ కాలంలో రూపకల్పన చేశారు. ఇప్పుడు చాలా మేరకు ఈ గ్రామాల రూపం మారింది. కొన్ని పేరుకే రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. కొన్ని పేరున్న పట్టణాలైనా అవి రెవెన్యూ జాబితాలో ఉండటం లేదు. పాత రికార్డుల ప్రకారమే రెవెన్యూ కార్యక్రమాలు జరుగుతున్నాయి. రెవెన్యూ గ్రామాల స్వరూపం మారాలంటే అధిక సమయం కావాలి.
>
> – సత్యనారాయణ, తహసీల్దార్, నరసన్నపేట

> **ఆదాయం కోల్పోతుంది..**
>
> 
>
> రెవెన్యూ రికార్డుల్లో నరసన్నపేట పేరు లేదు. నాలుగు రెవెన్యూ గ్రామాల పరిధిలో నరసన్నపేట ఉండటం వలన చాలా ఆదాయం నరసన్నపేట పంచాయతీ కోల్పోతుంది. గొట్టిపల్లి, బొరిగివలస, సత్యవరం రూరల్ పంచాయతీలకు నరసన్నపేటకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ వెళ్లిపోతుంది. దీనిని సరిచేయాలంటే రెవెన్యూ గ్రామాలను మార్చాల్సిన అవసరం ఉంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నరసన్నపేటను రెవెన్యూ గ్రామంగా మార్చాలి.
>
> – బూరెళ్ల శంకర్, సర్పంచ్, నరసన్నపేట

చెరువు గట్టు ఆక్రమణ

- ఎమ్మెల్యే తాలూకా అని అధికారులకు బెదిరింపు..



అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్న స్థలం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని గోరువానిచెరువు గట్టును ఆక్రమించి, గాంధీనగర్ సమీపంలో పోలాకి రోడ్డుకు ఆనుకొని అక్రమ నిర్మాణానికి కొంతమంది ఆక్రమణదారులు పాల్పడుతున్నారు. అధికారి పార్టీ పేరు చెప్పి ఎమ్మెల్యే తాలూకా అని అధికారులను బెదిరించి నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో సర్వాత్రా విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ తాలూకా అయితే అక్రమంగా నిర్మాణాలు చేయవచ్చా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రూ.లక్షల విలువైన ఈ స్థలంలో అక్రమ నిర్మాణం సరికాదని స్థానికులు అంటున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని వద్ద ప్రస్తావించగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే పనులను నిలిపివేయించామన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేసేదెప్పుడు?

- ప్రతినెలా అప్పుల కోసం సీఎం చంద్రబాబు తిప్పలు
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను నమ్మించిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు అమలు చేయలేని దుస్థితిలో ఉన్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. హామీలు అమలు చేయలేక, తమ అసమర్థతను అంగీకరించలేని చంద్రబాబు, కూటమి నాయకులు వారి తప్పులను గత ప్రభుత్వంపైకి నెట్టివేయాలనుకోవటం దురదృష్టకరమన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తుచేశారు. చంద్రబాబు అధికారం చేపట్టిన మరుసటి రోజు నుంచే పింఛన్లు, జీతాలు చెల్లించేందుకు అప్పులు కోసం అనేక తిప్పలు పడుతున్నారని అన్నారు. అభివృద్ధి ఆంధ్రాను పక్కన పెట్టి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను నమ్మించిన చంద్రబాబు.. ఇప్పుడు ఎందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయలేదని ప్రశ్నించారు. తొమ్మిది నెలల చంద్రబాబు పాలనలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండానే రూ.1.19 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. సంపద సృష్టిస్తానని, అభివృద్ధి చేస్తానని నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులకు సంపద సృష్టించారన్నారు. పల్లెపండగ పేరుతో ఆ పార్టీ నాయకులు నిధులు దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తులకు గడువు పెంపు

పాతపట్నం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాతపట్నం మండలానికి శ్రీశైన సామాజిక వర్గానికి ఒక మద్యం షాపు కేటాయించినట్లు సీఐ కె.కృష్ణారావు గురువారం తెలిపారు. దరఖాస్తు స్వీకరణ గడువు ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు పెంచినట్లు చెప్పారు. 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా పాతపట్నం ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 10న లాటరీ తీస్తారన్నారు. దరఖాస్తు చేసుకునేవారు శ్రీకాకుళం జిల్లా వాసి, శ్రీశైన సామాజికవర్గానికి చెందిన వారై ఉండాలన్నారు. స్థానిక తహసీల్దార్‌తో ధ్రువీకరించిన సంప్లమెంటరీ కుల ధ్రువపత్రం ఉండాలన్నారు.

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన



ఓటింగ్‌లో పాల్గొంటున్న విద్యార్థిని



ఓటు వేసిన అనంతరం సిరా గుర్తులు చూపిస్తున్న విద్యార్థులు

సారవకోట: మండలంలోని నౌతళ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటింగ్ విధానంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. 4 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయడం, పోలింగ్ విధానం, ఓటింగ్ తదితర అంశాలను తెలియజేసేందుకు ఓటింగ్ ప్రక్రియ చేయించినట్లు ఉపాధ్యాయుడు రమేష్‌నాయుడు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

83 మందికి నేత్ర పరీక్షలు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు సమృద్ధి, రామచంద్ర, అప్పలరాజు వైద్య సేవలందించారు. గ్రామానికి చెందిన 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 28 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ పాల్గొన్నారు.


రోడ్డుపై చెత్త వేస్తే ఫైన్

పొందూరు: రోడ్డుపై చెత్త వేసినా, రోడ్డు పక్క మల, మూత్రం విసర్జించినవారి నుంచి ఫైన్ వసూలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ గురువారం అధికారులకు ఆదేశించారు. పొందూరులో కాటి చెరువు కాలనీ నుంచి పెద్ద చెరువు వరకు సుమారు రూ.90 లక్షలతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్య నిబంధనలు పాటించాలన్నారు. మేజర్ పంచాయతీలో ఉన్న నిధులన్నీ పారిశుధ్యం, మౌలిక వసతులకే వినియోగించాలన్నారు. రోడ్డు పనులకు ఎన్ని నిధులు కావాలన్నా మంజూరు చేస్తానని చెప్పారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో మందిరం

హిరమండలం: మండల కేంద్రంలోని సత్యసాయి బాబా మందిరం జీర్ణావస్థకు చేరటంతో ప్రజల భాగస్వామ్యంతో పునర్ నిర్మాణం చేపడతామని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. గురువారం దేవరొట్టి వీధిలోని సత్యసాయి మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా శత జయంతి ఉత్సవాల నాటికి ఆధునిక హంగులతో నూతన మందిరం నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త బి.నర్సింహమూర్తి, మండల అధ్యక్షుడు ఎ.అబ్బాయి, గౌరవ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, సాంకేతిక సలహాదారుడు ఎస్.సాయిబాబా, బుచ్చబ్బాయి, చంటి, భక్తులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పనే ధ్యేయం



కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణరావు

నరసన్నపేట: యువతకు విద్యతోపాటు స్వయం ఉపాధికి తగిన సలహాలు, సూచనలు, శిక్షణ ఇచ్చేందుకు సత్యసాయి సేవా సమితి ముందుంటుందని, వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక చిత్తిరివీధిలోని సత్యసాయి మందిరంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. యువత ఇతరులపై ఆధారపడకుండా వారికి వారే జీవనోపాధి కల్పించుకునే విధంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సత్యసాయి సమితులు ఆయా ప్రాంతాల్లో ఉన్న అవకాశాల మేరకు యువతకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే చేనేత మగ్గాలపై పలువురికి శిక్షణ ఇచ్చామన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి నరసింహామూర్తి, సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, తదితరులు మాట్లాడుతూ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. 18 మందికి 45 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామని చిత్తిరి వీధి మందిరం ప్రతినిధి వి.నాగేశ్వరరావు అన్నారు. లలితమ్మ, కె.ఎల్.ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదాస్‌ను కలిసిన స్వరూప్



కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్వరూప్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌ను పార్టీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా నియమితులైన మెంటాడ స్వరూప్ గురువారం నరసన్నపేటలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ పదవి రావడానికి సహకరించిన కృష్ణదాస్‌కు స్వరూప్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కృష్ణదాస్ మాట్లాడుతూ యువజన విభాగంలో వైఎస్సార్‌సీపీని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, దానికి తగ్గట్టుగా కార్యాచరణ రూపకల్పన చేయాలని సూచించారు. పార్టీని అందరూ సమన్వయంతో ముందుకు తీసుకువెళ్లాలని కృష్ణదాస్ అన్నారు. ఈ సందర్భంగా కృష్ణదాస్‌ను స్వరూప్ సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

నరసన్నపేట: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేసింది. నరసన్నపేట మండలానికి లుకలాపు రవి, పోలాకి మండలానికి కణిత కృష్ణారావు, జలుమూరు మండలానికి కనుసు సీతారాం, సారవకోట మండలానికి వరుదు వంశీకృష్ణను నియమించింది.

అన్నప్రసాదం పంపిణీ



నరసన్నపేటలోని కలివరపుపేటలో ఉన్న షిర్డీ సాయి ఆలయంలో అన్నార్తుల ఆకలిని భక్తులు తీర్చుతున్నారు. గురువారం 250 మందికి బీదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సూచనల మేరకు ప్రతీ గురువారం ఒక్కో దాత ముందుకు వచ్చి బీదల ఆకలిని తీర్చుతున్నారని కమిటీ ప్రతినిధి చంద్రభూషణరావు తెలిపారు. ఈ గురువారం బరాటం శశికుమార్ దాతగా ముందుకు వచ్చారన్నారు. గడిచిన మూడు సంవత్సరాలుగా దీనిని పాటిస్తున్నామని షిర్డీ సాయి ఆలయ కమిటీ ప్రతినిధి వైశ్యరాజు సత్యానందరాజు తెలిపారు. – నరసన్నపేట

ఎండుతున్న వరి పొలాలు



ఈ చిత్రం ఆమదాలవలస మండలంలోని జొన్నవలస ప్రాంతంలోని ఎండిపోతున్న వరి పొలాలు. మండలంలోని జొన్నవలస, సైలాడ, కుమ్మరిపేట, తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో రబీ వరి పంట పొలాలు (వెద పొలం) సాగునీరు అందక ఎండిపోతున్నాయి. రైతులు పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో ఉన్న నీటిని మోటార్లతో తోడుతున్నారు. ప్రస్తుతం అవి కూడా ఎండిపోవడంతో నీరులేక పంట పాడవుతుందని ఆందోళన చెందుతున్నారు. వంశధార ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందించాలని కోరుతున్నారు. – ఆమదాలవలస రూరల్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



మెళియాపుటి మండల కేంద్రంలోని బండార్లమ్మ వీధి నుంచి మెయిన్ రోడ్డుకు వెళ్లే రహదారిలో గల ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించే తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ తీగలకు పిచ్చిమొక్కలు అల్లుకోవడంతో విద్యుత్ ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది. ఇటీవల ఇదే వీధిలో విద్యుత్ ప్రమాదం జరిగి ఓ షెడ్ దగ్ధమైంది. తీగలు పైకి ఉండేలా విద్యుత్‌శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని, తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – మెళియాపుట్టి

అభినందన



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాలల గ్రిగ్స్ పోటీల్లో నరసన్నపేట మండలం గుండవల్లిపేటలోని మహాత్మా జ్యోతీబా పూలే స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం, సాఫ్ట్ బాల్ పోటీల్లో మూడో స్థానం సాధించారు. గురువారం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్ సురేష్ రెడ్డి, సాఫ్ట్ బాల్ కెప్టెన్ ఎం.కిశోర్, జట్టు సభ్యులను ప్రిన్సిపాల్ రాయికన్న, ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ పీఈటీ మధును సత్కరించారు. – నరసన్నపేట